# లవ్ స్టోరీ

## ఛాలెంజ్

వారంలో — శుక్రవారం రోజు 'భద్రకాళి' గుడికి ఎక్కువ జనం వస్తారు. నిజంగా — దాన్ని ఓ 'గుడి' అనే బదులు 'రెస్ట్ పాయింట్' అనాలి.

కారణం...

చుట్టూ చిన్న చిన్న కొండలు...

మధ్యన మానస సరోవరంలా ఓ చెరువు.

పైన ఎగిరే కొంగల గుంపులు.

ఆ పక్కగా ఎత్తైన ప్రదేశంపై దేవాలయం.

గుడికి క్రింది వైపుగా వుంది — 'లాల్ బహదూర్ కాలేజి' (ఎల్.బి. కాలేజ్) కొల్లేటి సరస్సుకు వలసవెళ్ళే కొంగల్లా... ఖాళీ దొరికితే చాలు గుడికే వస్తారు స్టూడెంట్స్.

ఆరుగురు...

మణి, చిదానంద్, రమేష్, వెంకట్, నారాయణ్, బాలు... సేమ్ క్లాస్. పొడుగులో ఫస్ట్ చిదానందైతే, వెయిట్‌లో ఫస్ట్ నారాయణ్. 'పిట్ట కొంచెము కూత ఘనము'-రమేష్ అతని మాటలకు ఎంతటి వారైనా దిగదుడుపే! టొమాటో ఎరుపు వెంకట్ — ప్రతి దాంట్లో 'ఛాలెంజ్' వెతికే బాలు. మణి ఈజ్ ఎ రేర్ క్యారెక్టర్ — అదే వారి స్నేహ బంధాన్ని, ఆప్త మిత్రుల్ని చేసింది. ఎడ్జస్ట్‌మెంట్స్ కోసం కంపార్ట్‌మెంట్స్ విడి పోతాయేమోగానీ... వీళ్ళు మాత్రం... నెవర్...

అంతా కలిసే వెడతారు... తిరుగుతారు

గుడికైనా... మరెక్కడికైనా

లీజర్ దొరికిందేమో — గుడికే దారి తీశారు.

మిట్ట మధ్యాహ్నం

అయినా గుడినిండా జనం.

సో... బయటే పీఠం వేశారు. ఇండియాలో పి.యమ్స్ మారినంతగా ఛేంజ్ చేయరా ప్లేస్‌ని! చేసేవేమో జోక్స్... కామెంట్స్... లాఫింగ్స్...!!!

** ** **

రొప్పుతూ వస్తున్నావిడను చూశాడు రమేష్.

"ప్స్... పాపం..."

"ఎందుకురా?"

"అంత అవతారాన్ని ఎలా భరిస్తుందో?"

"ఊహూ... అయితే నీవు ఎత్తుకు రారాదూ!"

"వామ్మో!!!"

"అయినా అంత కష్టపడి రాకపోతేనేంరా?"

"ఆ... ఆంటీ బరువుని కాస్త తగ్గించమని వేడుకోటానికి అయి వుంటుందిలే..."

నవ్వులే నవ్వులు!

తర్వాత

అమ్మాయిలు—

టీనేజ్ అమ్మాయిలు... రంగుల డ్రెస్సుల్లో. ఫాలో చేశాయి వారి కళ్ళు.

"ఇంతెండలో... వాళ్ళెందుకురా...?" బాలు సందేహం.

"నీవెందుకొచ్చావురా?" నారాయణ్ ఎదురు ప్రశ్న.

"ఎగ్జామ్స్‌లో పాస్ చేయమని మొక్కు కోవడానికి కావచ్చు!"

"అయ్యో! వీడింకా 1920లో వున్నాడ్రోయ్ అమాయక చక్రవర్తి"

"ఔన్రా, ఇంతకంటే మంచి ప్లేస్ ఎక్కడుంది — పేరుకే గుడికొచ్చినట్లుగానీ వాళ్ళు వెలగబెట్టే రాచకార్యాలు ఎవరికి తెలుస్తాయి. ఇది మోడరన్ యుగం!" వత్తాసు పలికాడు మణి.

"ఆ...!!!" నోరు తెరిచాడు నారాయణ్. ఆ పొజిషన్‌లో అతన్ని చూసి నవ్వుకున్నారంతా.

జనం పల్చబడ్డారప్పటికి — లోనికెళ్దామనుకున్నారంతా.

వెళ్ళేది దర్శనం కోసం — తెచ్చేది ప్రసాదం. అంతవరకు చేతుల్లో 'భరత నాట్యం' చేసిన బుక్స్ వుంటే ఎలా? అందుకే—

"ఒరేయ్ మణీ, బుక్స్ పట్టుకోరా — నీవంతు మేం తెస్తాంలే" అంటూ వెళ్ళారు.

** ** **

ఒక్కడే మిగిలాడు — ఒంటరిగా

సూర్యుని చుట్టూ భూమి తిరిగినట్టు — అతని కళ్ళు.

కొండలు — చెరువు ... అడుగు వరకున్న మెట్లు... అలా, అలా.

సడన్‌గా ఆగాయి అక్కడ! చివరి మెట్టుపై — మోకాటిలోతు నీళ్లలో కాళ్ళు మాత్రమే మునిగేటట్టు — ఒంటరిగా, ఒద్దిగ్గా, పొందిగ్గా కూర్చొనుంది ఓ అమ్మాయి.

ఎందరో సుందరాంగుల రూపాల్ని ఒక చోట ప్రోది చేసినట్టూ—

అంతవరకు తను చూడని క్రొత్త అందాలు సంతరించుకున్నట్టూ—

'అమ్మాయా...?... ఓ అందాల భరిణా?...' తనకే అనుమానం— రాజధాని రాత్రిళ్ళలో దేదీప్యమానంగా వెలిగే 'బిర్లా మందిర్'లా నల్లని నీళ్ళలో తెల్లని పాలవలె వెలిగిపోతోంది — తను ధరించిన తెల్లని పంజాబ్ డ్రెస్‌లో!

సరిగ్గా అప్పుడే ప్రత్యక్షమయ్యారు తిలకాలు దిద్దిన ముఖాల్తో.

"ఒరేయ్ వాడ్ని డిస్టర్బ్ చేయకండ్రా—" రమేష్ మాటలకి ఈ లోకంలోకి వచ్చి పడ్డాడు మణి.

"పావుగంట నుంచి అబ్జర్వ్ చేస్తున్నాంరా నీవు ఆ అమ్మాయి వైపే చూడ్డాన్ని" అన్నాడు బాలు.

"ఇంకేం మనవాడు కవితలల్లేస్తాడన్న మాట, రాసుకోండ్రా" రమేష్ కొంటెతనం.

"ఛాలెంజ్ చేస్తే చెరువులోకి దూకలేని వీడూ, ఆమెకోసం దూకుతాడ్రోయ్"

రచయిత చిరునామా:
బి. మనోహర్,
18-5-41, కరీమాబాద్,
వరంగల్ - 506 002.



ఛాలెంజ్ ట్రైపు బాలు.

"ఒరేయ్ వాడికి స్విమ్మింగ్ రాదురా" చిదానంద్ భయం.

"అయితే ఛాలెంజ్ ఏమిటంటే...ఆ... రేయ్ మణీ!నీకెలాగూఆమె నచ్చిందంటు న్నావ్ — కాబట్టి ఓన్లీ టు మినిట్స్ ఆమెతో మాట్లాడి రావాలి— అంటే — నీవు గెలిస్తే...ఊ... 'ఏకశిల'లో టిఫిన్ చేయిస్తా మీకు" బాలు ఛాలెంజ్ చేశాడు.

"ఓస్ అంతేకదా—ఒప్పుకో మణి — నీ వైపు నేనున్నాను" అంటూ ఛాలెంజ్ నిర్ణయించేశాడు చిదానంద్.

ఛాలెంజ్ కోసం కాకపోయినా కనీసం ఆమెతో 'మాట్లాడి' రావాలన్న తలంపుతో మెంటల్‌గా ప్రిపేర్ అయ్యాడు. ఒక్కొక్క మెట్టుపై రెండ్రెండు అడుగులేస్తూ దిగు తున్నాడు కిందివైపు — భయంగానే.

తనూహించినట్లు జరక్కపోతే... 'వామ్మో' అనుకున్నాడు. అలా ఊహల్లో ఆమెను చేరాడు.

తడబడుతూనే అడిగాడు.

"హ...లో...ఎక్స్‌క్యూజ్ మీ — ఇక్కడ లోతుంటుందాండీ?"

"దిగిచూస్తే తెలియదా?" గడుసుగా జవాబిచ్చింది.

"ఓ డౌటండీ" అడిగాడతను.

ప్లేట్ మార్చాడనుకుంది.

"మీరు... మీరూ... సంధ్య ఫ్రెండ్ 'రేఖ'గారిలా ఉ...న్నా...రు...?" ఏదో గుర్తు వచ్చిన వాడిలా అడిగాడు.

"ఓ... సంధ్యా! అది మీకెలా తెలుసు" ముఖంలో ఆత్రుత, కళ్ళలో ఆసక్తి ప్రస్ఫుటంగా కనిపించాయతనికి.

"ఆమె నా క్లాస్‌మేట్"

"ఓ... అయితే ఎల్.బి. కాలేజ్‌లో మీరు బి.కాం. ఫైనలన్న మాట"

"గ్లాడ్ టు మీట్ యూ" అందామె.

"థాంక్స్" అన్నాడతను.

"అయితే నన్నెలా గుర్తు పట్టారు" ఆశ్చర్యంగా అడిగింది.

"సంధ్యతో ఇదే డ్రెస్‌లో ఫొటోలో చూశాను. నా ఫ్రెండ్ 'రేఖ' అని పరిచయం చేసింది కూడా"

"అదా అసలు విషయం — బాగానే ఊహించారే — ఫొటోలో వుంది నేను కాదు" పచ్చి వెలక్కాయ పడ్డట్టయిందతనికి.

"అయితే... మీ... రూ...?" పొడిగా అడిగాడు.

"నా పేరు గీత" బయటపెట్టింది పేరుని.

"సంధ్య, రేఖ, నేను ముగ్గురం స్నేహితులం. ఫొటోలో వుంది రేఖ. అలాంటి డ్రెస్‌నే ముగ్గురం కొనుక్కున్నాం. అది చూసే మీరు పొరబడ్డారు" ఆమె రీ- ఎక్స్‌ప్లనేషన్.

"ఏనీ వే మనమిలా మీటవ్వడం హాపీగా వుంది. ఆ — అన్నట్టు మా క్లాస్‌కు టైమైంది. లీజరు దొరికితే ఇలా వస్తాం మేం" అంటూ సెలవు తీసుకున్నాడు.

"బై" చెప్పింది గీత.

ఇప్పుడతను ఈ ప్రపంచాన్నే జయించినంత సంతోషంతో మిత్రబృందాన్ని చేరాడు.

అప్పటికి ఛాలెంజ్ ప్రకారం రెండు నిమిషాలు దాటి మూడు నిమిషాలు ఎక్కువే అయ్యాయి. మిత్రుల ముఖాల్లో ఆనంద కిరణం — మణి విన్నయినందుకు.

అంతా కదిలారు — క్లాస్ వైపు కాదు — 'ఏకశిల' హోటల్ వైపు.

*

పటిష్ఠమైన కట్టడాలకు
చిరకాల మన్నికకు
భీమ సిమెంట్